సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 23 । సెప్టెంబర్ । 2023



ఖేలో ఇండియా క్రీడాకారుల సత్తా

ఏలూరులోని రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా సెంటర్ క్రీడాకారులు పతకాల పంట పండిస్తున్నారు. జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారు. 8లో ▸



పూజా సామగ్రి కోసం వెళ్తూ..

వినాయకుడి పూజా సామగ్రి తెచ్చేందుకు వెళ్తున్న ఇద్దరు స్నేహితుల్ని లారీ వెనుక నుంచి ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. 8లో ▸



హత్యకేసులో ఆరుగురి అరెస్టు

భీమవరంలో ఈనెల 17న జరిగిన హత్య ఘటనలో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ బండారు శ్రీనాథ్ తెలిపారు. 8లో ▸

స్త్రీనిధి చెల్లింపు ఇక సులభతరం

స్వచ్ఛంగా.. సరళంగా..

- పేటీఎం మెషీన్ ద్వారా లావాదేవీలు
- రుణ వాయిదాల చెల్లింపు ఇక సులువు
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రెండు మండలాల్లో ప్రారంభం
- త్వరలో మరో నాలుగు మండలాల్లో..
- జిల్లావ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమలుకు చర్యలు



గ్రామ సమాఖ్య సభ్యులకు పేటీఎం మెషీన్ అందిస్తున్న అధికారులు



ఉంగుటూరులో మెషీన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): మహిళా సాధికారత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. స్వయం సహాయక సంఘాలకు విరివిగా రుణాలు అందించడంతో పాటు సకాలంలో చెల్లించిన వారికి వడ్డీ రాయితీ కల్పిస్తూ అన్నింటా ప్రోత్సహిస్తోంది. దీనిలో భాగంగా మరో ముందడుగు వేసి స్త్రీనిధి ద్వారా రుణం తీసుకున్న సభ్యులకు చెల్లింపులను సులభతరం చేసింది. పేటీఎం మెషీన్ ద్వారా వాయిదాలను డిజిటల్ విధానంలో పూర్తి పారదర్శకతతో చెల్లించేలా నూతన విధానాన్ని ప్రవేశపెట్టింది. ముందుగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. పైలెట్ ప్రాజెక్టుగా పశ్చిమగోదావరి జిల్లాలో ఉండి, ఏలూరు జిల్లాలో ఉంగుటూరు మండలాల్లో నూతన విధానాన్ని అమలుచేస్తోంది. త్వరలో పశ్చిమగోదావరి జిల్లాలో అత్తిలి, ఆచంట, ఏలూరు జిల్లాలో అగిరిపల్లి, ద్వారకాతిరుమల మండలాల్లో అమలుకు చర్యలు తీసుకుంది. అలాగే ఉమ్మడి జిల్లాలో పూర్తిస్థాయిలో అమలుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. డిజిటల్ పేమెంట్ల ద్వారా అవకతవకలకు తావుండదని అధికారులు అంటున్నారు.

	ఏలూరు జిల్లా	పశ్చిమగోదావరి
స్త్రీ నిధి రుణం తీసుకున్న సభ్యులు	13,573	9,162
రుణం పొందిన వారు ఉన్న గ్రూపులు	3,463	2,703
రుణ మొత్తం	రూ.93.26 కోట్లు	రూ.64.58 కోట్లు
గ్రామ సమాఖ్యలు	1,262	892

ప్రయోజనాలెన్నో.. స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధికి గరిష్టంగా రూ.లక్ష వరకు స్త్రీనిధి రుణాలు అందిస్తున్నారు. వీరు సమాన వాయిదాల్లో రుణం చెల్లించాల్సి ఉంటుంది. రుణం తీసుకున్న సభ్యులు వాయిదా మొత్తాన్ని సంఘ అధ్యక్షురాలికి అక్కడి నుంచి గ్రామ సమాఖ్య సంఘానికి అందించాలి. గ్రామ సమఖ్య ఖాతా నుంచి గ్రామ సంఘం అధ్యక్షుల ద్వారా వీఓఏ స్త్రీనిధి ఖాతాకు వాయిదా మొత్తాన్ని జమ చేసేవారు. ఈ విధానంలో సమయం వృథా, నిర్ణీత సమయంలో చెల్లించకపోతే వడ్డీ భారం పడేది. వీటన్నింటికీ స్వస్తి చెబుతూ ప్రభుత్వం డిజిటల్ విధానాన్ని తీసుకువచ్చింది. పేటీఎం మెషీన్ ద్వారా వాయిదాల సొమ్మును క్షణాల్లో చెల్లించడంతో పాటు రశీదును కూడా పొందవచ్చు. అలాగే చెల్లించిన మొత్తం, చెల్లించాల్సిన రుణం వివరాలు సులభంగా తెలుసుకోవచ్చు.

గ్రామ సమాఖ్యలకు మెషీన్

నూతన విధానంలో స్త్రీనిధి మహిళా బ్యాంకు ప్రతి గ్రామ సమాఖ్య సంఘానికి పేటీఎం మెషీన్‌ను అందిస్తోంది. గ్రామ సమాఖ్య సంఘం నియమించిన వీఓఏ లాగిన్‌తో మెషీన్‌ను నిర్వహిస్తారు.

ఉపయోగించే విధానం

- పేటీఎం మెషీన్‌ను వీఓఏ మొబైల్ నంబర్‌తో లాగిన్ కావాలి.
- పేమెంట్ స్వయం సహాయక సంఘం (ఎస్‌హెచ్‌జీ) ఐడీ నమోదు చేయాలి.
- తర్వాత ఆ సంఘంలో స్త్రీ నిధి రుణం తీసుకున్న సభ్యుల పేర్లు కనిపిస్తాయి.
- ఏ సభ్యురాలి వాయిదా చెల్లించాలో నమోదు చేయాలి.
- సభ్యురాలి డిమాండ్ మొత్తం, క్లోజర్ ఔట్ స్టాండింగ్ చూపిస్తుంది.
- వాయిదా మొత్తాన్ని నమోదు చేయాలి.
- ఎంత మంది సభ్యులు పేమెంట్ చేస్తారో వారి రికవరీ మొత్తాలను నమోదు చేయాలి.
- నమోదు చేసిన మొత్తం, రికవరీ మొత్తాన్ని సరిచూసుకోవాలి.
- వాయిదాను ఏ రూపంలో చెల్లిస్తామో ఎంపిక చేసుకోవాలి.
- రూపే కార్డు, స్కాన్ క్యూఆర్ కోడ్ (యూపీఐ పేమెంట్) సెలెక్ట్ చేసి చెల్లింపులు జరపాలి.
- కంప్లీట్ ఆర్డర్‌పై క్లిక్ చేసి ప్రింట్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.
- అనంతరం వచ్చే ప్రింట్ రశీదును సభ్యులకు అందజేయాలి.

పారదర్శకంగా పేమెంట్లు



స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలను తిరిగి వాయిదాల రూపంలో చెల్లించడానికి నూతనంగా ప్రవేశపెట్టిన పేటీఎం మెషిన్ ద్వారా లావాదేవీలు పారదర్శకంగా జరుగుతాయి. పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా అమలుకు ముందు ప్రయోగాత్మకంగా ఉండి మండలంలో అమలు చేస్తున్నాం. త్వరలో మరో రెండు మండలాల్లో కూడా అమలు చేయనున్నాం.

– ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డీఆర్‌డీఏ పీడీ, పశ్చిమగోదావరి

సమయం ఆదా



స్త్రీనిధి రుణం చెల్లింపులకు గ్రామ సమాఖ్య ద్వారా బ్యాంకుకు వెళ్లి జమ చేయాల్సి వస్తోంది. దీంతో సమయం వృథా అవుతోంది. ఇప్పుడు పేటీఎం మెషీన్ ద్వారా చెల్లింపులు జరపడంతో సమయం ఆదాతో పాటు సభ్యులకు వెంటనే రశీదు కూడా వస్తుంది. పేమెంట్ వివరాలు సులభంగా తెలుసుకోవచ్చు. లావాదేవీలు పారదర్శకంగా ఉంటాయి.

– పి.జయరాజు, డీఆర్‌డీఏ పీడీ, ఏలూరు

ధాన్యం సేకరణకు సిద్ధం కావాలి

కలెక్టర్ ప్రశాంతి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: జిల్లాలో సార్వా ధాన్యం కొనుగోళ్లను వచ్చేనెల మొదటి వారంలో ప్రారంభించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సార్వా ధాన్యం కొనుగోళ్లపై అధికారులు, రైస్ మిల్లర్ల అసోసియేషన్‌తో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 2.14 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయగా ప్రస్తుతం ఈ–క్రాప్ నమోదు జరుగుతుందన్నారు. ఈ మేరకు ధాన్యం సేకరణకు అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ప్రస్తుత పంటలో 4 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశముందని, జిల్లాలోని 387 రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణకు సన్నద్ధం కావాలన్నారు. సుమారు కోటి గోనె సంచులు అవసరమవుతాయని అధికారులు గుర్తించారని, వాటిని ముందస్తుగా సమకూర్చుకోవాలని సూచించారు. ప్రత్యేక అధికారుల ఆధీనంలో తేమ యంత్రాలు ఉండాలన్నారు. రైతు భరోసా కేంద్రాలు, మిల్లుల వద్ద ధాన్యంలో తేమ శాతం తేడాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ధాన్యం సేకరణ కేంద్రానికి అవసరమైన సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్, హెల్పర్లను నియమించుకోవాలని ఆదేశించారు. సేకరించిన ధ్యానం మిల్లులకు తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ విధిగా ఏర్పాటు చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ టి.శివ రామప్రసాద్, జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి ఎస్.సరోజ, డీసీఓ ఎం.రవికుమార్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సామంతపూడి శ్రీరామరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అదుపులోనే జ్వరాలు



భీమవరంలో లార్వా మందు పిచికారీ

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో జ్వరాలు అదుపులోనే ఉన్నాయని డెంగీ, మలేరియా వంటి కేసులు నమోదు కాలేదని డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వాతావరణంలో మార్పులతో సాధారణ జ్వరాలు నమోదవుతున్నాయని, చికిత్స తీసుకున్న వెంటనే కోలుకుంటున్నారన్నారు. జిల్లా అంతటా జ్వరాలపై సర్వే చేస్తూ కేసులను గుర్తించి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. దోమల నివారణకు యాంటీ లార్వా మందును పిచికారీ చేయిస్తున్నామన్నారు. ప్రజలు శుభ్రమైన నీరు తాగాలని, నిల్వ ఉన్న ఆహారం తీసుకోరాదని, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, జ్వరం సోకితే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. ఏ జ్వరం అయినా నిర్లక్ష్యం చేయవద్దన్నారు.

గొల్లలకోడేరు ఉప సర్పంచ్ సస్పెన్షన్

పాలకోడేరు: గొల్లలకోడేరు పంచాయతీ ఉప సర్పంచ్ కలిదిండి శ్రీనివాసవర్మను మూడు నెలల పాటు సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారు. మార్గదర్శకాలకు వ్యతిరేకంగా పంచాయతీ తీర్మానాలు లేకుండా, టెండర్లు పిలవకుండా వర్క్స్ కమిటీని నియమించకుండా, తన పదవిని, అధికారాన్ని అడ్డుపెట్టుకుని పనులు చేసి నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ వార్డు సభ్యుడు కె.బాబూరావు, మరో ఐదుగురు వార్డు సభ్యులు స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ విచారణకు ఆదేశించారు. కాంట్రాక్టర్లు, గ్రామస్తులు పనులు చేసేందుకు ముందుకు రాకపోవడంతో గ్రామాభివృద్ధి, ప్రయోజనాల దృష్ట్యా తాను పనులు చేశానని ఉపసర్పంచ్ శ్రీనివాసవర్మ వివరణ ఇచ్చారు. రూ.11 లక్షలు, రూ.40 లక్షలు, రూ.20 లక్షల విలువైన మూడు సీసీ రోడ్ల నిర్మాణాలు చేయగా, పంచాయతీరాజ్ మార్గదర్శకాలు ప్రకారం రూ.5 లక్షలు మించి పనులు చేసినప్పుడు టెండర్లు పిలవాలనే నిబంధనలు పాటించలేదు. దీనిపై ఉప సర్పంచ్ ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో కలెక్టర్ చర్యలు తీసుకున్నారు.

బొండాడలో విజిలెన్స్ దాడులు



సీజ్ చేసిన స్టాకుతో విజిలెన్స్ అధికారులు

కాళ్ల: ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా పురుగుమందులు విక్రయిస్తున్న ఇంటిపై శుక్రవారం దాడి చేసి కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎస్సై సీహెచ్ రంజిత్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కాళ్ల మండలం బొండాడలో ఎలాంటి అనుమతులు లేకుండా పురుగుమందులు విక్రయిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో లైసెన్స్ లేకుండా విక్రయిస్తున్న 31 రకాలకు చెందిన 1,014 లీటర్ల పురుగుమందులు సీజ్ చేశామన్నారు. వీటి విలువ సుమారు రూ.7,48,348 ఉంటుందన్నారు.

క్వాష్ పిటిషన్ కొట్టివేతపై హర్షం

ఏలూరు (టూటౌన్): తెలుగుదేశం అధినేత చంద్రబాబు క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడంపై వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు పితాని దుర్గాప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. రూ.371 కోట్ల స్కిల్ స్కామ్‌లో చంద్రబాబుకు రిమాండ్ విధించడాన్ని చాలెంజ్ చేస్తూ వేసిన రివ్యూ పిటిషన్, అక్రమ కేసు రద్దు చేయాలనే క్వాష్ పిటిషన్లను ఏపీ హైకోర్టు కొట్టివేయడాన్ని ఆయన స్వాగతించారు. స్కిల్ స్కామ్‌లో అరెస్టై రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న చంద్రబాబును సీఐడీ అధికారులు రెండు రోజులు విచారించడానికి అనుమతిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు ఇచ్చిన తీర్పుపై కూడా హర్షం వ్యక్తం చేశారు. సీఐడీ తరపున వాదనలు వినిపించిన హైకోర్టు అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వారి బృందం, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి, వారి బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

నేడు స్పీకర్ తమ్మినేని రాక

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని స్పీకర్ తమ్మినేని సీతారాం శనివారం సందర్శించనున్నట్టు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. ఉదయం 9.15 గంటల సమయంలో ఆయన స్వామి, అమ్మవార్లను దర్శిస్తారని, వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలకాలని పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు కోరారు.

నిర్ణీత కాలంలో సమస్యల పరిష్కారం

'జగనన్నకు చెబుదాం'లో కలెక్టర్ ప్రశాంతి



కాళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

కాళ్ల: జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాల పరిమితిలోపు పరిష్కరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. కాళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ ప్రశాంతి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాస్థాయి స్పందన కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మండల స్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల అర్జీలకు అధికారులు, సచివాలయ సిబ్బంది నాణ్యమైన పరిష్కారాలు చూపిస్తారన్నారు. అర్జీల్లో 90 శాతం సచివాలయాల పరిధిలోనే పరిష్కారమవుతాయని చెప్పారు. జిల్లా అధికారులంతా ఈ కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మొత్తం 19 అర్జీలను స్వీకరించారు. వీటిలో ప్రధానంగా రెవెన్యూ, మత్స్య, హౌసింగ్ తదితర శాఖలకు చెందినవి ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

అర్జీల్లో కొన్ని..

- దొడ్డనపూడిలో డంపింగ్ యార్డు ఏర్పాటుచేయాలని గ్రామస్తుడు జె.పోతురాజు అర్జీ అందజేశారు.
- కాళ్ల నుంచి ఆకివీడు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉందని, చర్యలు తీసుకోవాలని కోలనపల్లి గ్రామ నివాసి సీహెచ్ ఏసురాజు వినతిపత్రం అందజేశారు.
- జువ్వలపాలెం–సీసలి డ్రెయిన్‌లో వ్యర్థాలను తొలగించాలని బొండాడపేట సర్పంచ్ గోళ్ల వెంకట సత్యనారాయణ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.
- తనకు రేషన్ కార్డు మంజూరు చేయాలని సీసలి గ్రామస్తురాలు దువ్వ నాగలక్ష్మి కోరారు.
- గ్రామంలో డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని దొడ్డనపూడికు చెందిన ఎస్.సుధీర్ అభ్యర్థించారు.
- ఏలూరుపాడు హైస్కూల్‌లో జరిగిన నాడు–నేడు పనులపై విచారణ చేయాలని సైపు రామకృష్ణ కలెక్టర్‌ను కోరారు.

ఈ కార్యక్రమంలో భీమవరం ఆర్డీఓ దాసి రాజు, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, డీఎస్పీ బి.శ్రీనాథ్, జిల్లా అధికారులు, తహసీల్దార్ టీఏ కృష్ణారావు, ఎంపీడీఓ జి.స్వాతి, ఎంపీపీ పెనుమత్స శిరీష, జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, కాళ్ల సర్పంచ్ బందా విజయ పాల్గొన్నారు.

సమష్టి కృషితో మెరుగైన ఫలితాలు

భీమవరం (ప్రకాశంచౌక్): మెరుగైన ఫలితాలు సాధించేందుకు అధికారులంతా సమష్టిగా కృషిచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డితో కలిసి మ్యూటేషన్, స్టోన్ ప్లాంటేషన్, స్వమిత్వ, ఎన్నికలు, హౌసింగ్ తదితర అంశాల పైడివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అంశాల వారీగా ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారుల డాక్యుమెంట్లను పూర్తిస్థాయిలో పరిశీలించి మ్యూటేషన్ జరపాలన్నారు. జిల్లాలో అధికంగా 40 శాతం మ్యూటేషన్లు తిరస్కరించామని, వాటిని పునః పరిశీలన చేయాలన్నారు. మండలాల వారీగా మూటేషన్ల ప్రగతి తెలుసుకున్నారు. తోకలపూడి, నరసింహపురం, పంజా వేమవరం తదితర గ్రామాల్లో 80 శాతం ప్రగతి కనబర్చిన అధికారులను అభినందించి, వీరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సర్వే అనంతరం రాళ్ల పాతడంలో మండల అధికారులు, సిబ్బంది మెరుగైన ఫలితాలు కనబర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పక్కాగా స్వమిత్వ సర్వే : స్వమిత్వలో ప్రభుత్వ భూములు, ప్రైవేట్ ఇళ్ల స్థలాలు పక్కాగా సర్వే చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే అనంతరం భూ యజమానులకు హక్కు పత్రాలను సకాలంలో అందించాలన్నారు. సోమవారం నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేసి నివేదికలను జిల్లా కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. స్వమిత్వ ప్రక్రియలో పొరపాట్లు లేకుండా క్షేత్రస్థాయిలో ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు పరిశీలించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించి కాళ్ల మండలం నుంచి రెండు ఫిర్యాదులు వచ్చాయని ఓటీఎస్ దరఖాస్తు, గృహ నిర్మాణానికి సంబంధించి సాంకేతిక ఇబ్బందులు తొలగాయన్నారు. ఇలాంటి సమస్యలు జిల్లాలో ఎక్కడ నమోదైన వాటిని పరిశీలించి దరఖాస్తుదారులను లబ్ధిదారుల ఖాతాలోకి చేర్చాలని కలెక్టర్ ప్రశాంతి స్పష్టం చేశారు. జిల్లా సర్వే అధికారి జాషువా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రోబోలతో ప్రయోగాలు అవసరం



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో మాట్లాడుతున్న ఐసీటీ అకాడమీ ఇన్‌చార్జ్ దినకర్‌రెడ్డి

సాక్షి, భీమవరం: దేశ రక్షణ, వ్యవసాయం, ఆక్వా రంగాలకు సంబంధించి ప్రకృతిలో మార్పుల అధ్యయనం కోసం రోబోలతో ప్రయోగాలు చేయాలని ఐసీటీ అకాడమీ ఏపీ స్టేట్ ఇన్‌చార్జ్ ఎస్.దినకర్‌రెడ్డి అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐసీటీ అకాడమీ, హానీవెల్ సాఫ్ట్‌వేర్ సంస్థ సహకారంతో శుక్రవారం ఏర్పాటుచేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఫర్ యూత్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్యార్థులు కేవలం కంప్యూటర్లకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, ఆక్వా, హార్టికల్చర్, రక్షణ రంగంలో రోబోల సహాయంతో పలు ప్రోగ్రామింగ్స్ రూపొందించి ఆయా రంగాల ప్రగతికి దోహదపడాలన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ, ప్రిన్సిపల్.ఎం జగపతిరాజు మాట్లాడుతూ రానున్న రోజుల్లో రోబోల వినియోగం మరింత విస్తృతమవుతుందన్నారు. కార్పొరేట్ వ్యవహారాల మేనేజర్ జి.అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ప్రాజెక్టులతో సృజనాత్మకత



సైన్స్ కాంగ్రెస్ శిక్షణ తరగతుల్లో రిసోర్స్‌పర్సన్స్

తణుకు అర్బన్: సమాజంలో నెలకొన్న పలు అంశాలపై విద్యార్థులతో సైన్స్ ప్రాజెక్టులు రూపొందించేందుకు సైన్స్ ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆప్కాస్ట్ జిల్లా సమన్వయాధికారి మల్లుల శ్రీనివాస్, ఏలూరు జిల్లా ఎన్‌సీఎస్‌సీ అకడమిక్ సమన్వయాధికారి ఎంవీ భాస్కరరావు, పశ్చిమగోదావరి జిల్లా అకడమిక్ సమన్వయాధికారి సీహెచ్ రాజు అన్నారు. తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలులో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి (ఏపీసీఓఎస్‌టీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ఒకరోజు సైన్స్ ఉపాధ్యాయుల ఓరియంటేషన్ తరగతులకు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకతను సైన్స్ ప్రాజెక్టుల ద్వారా బయటకు తీసుకురావాలని పిలుపునిచ్చారు. రిసోర్స్ పర్సన్స్ జి.సుకుమార్, సీహెచ్‌వీవీ సత్యనారాయణ, బి.గోపాలరెడ్డి, తణుకు డివిజన్ పరిధిలోని 120 మంది సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పోలింగ్ స్టేషన్ల మార్పులు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో పోలింగ్ స్టేషన్ల మార్పులు, చేర్పుల ప్రక్రియను అత్యంత పారదర్శకతతో చేపట్టామని, అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆరు కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు. వాటిలో ఆచంట నియోజకవర్గం పెనుమంట్ర మండలం మల్లిపూడి గ్రామంలోని అర్జునుడుపాలెం నివాసులకు అంగన్‌వాడీ ప్రీస్కూల్ బిల్డింగ్‌లో ఒకటి, పాలకొల్లు ఏపీటిడ్కో హౌసింగ్ లేఅవుట్ కాలనీవాసులకు కొత్తపేట పంచాయతీ న్యూ చర్చి పెంకుళ్లపాడు ఎంపీపీ స్కూల్‌లో ఒకటి, భీమవరం గునుపూడి ప్రాంతంలో టిడ్కో నివాసితులకు రెండు, తణుకు నియోజకవర్గం అత్తిలి మండలం వరిగేడు పంచాయతీ ఎర్రసీలిగుంట అంగన్‌వాడీ ప్రీ స్కూల్‌లో ఒకటి, ఇరగవరం మండలం రేలంగి గ్రామం గమళ్లపాలెం ఎంపీపీ స్కూల్‌లో ఒక కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు.

జిల్లాలో 1,460 పోలింగ్ కేంద్రాలు

జిల్లాలో మొత్తం 1,460 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో 43 పోలింగ్ స్టేషన్ల లొకేషన్ మార్పు కోసం, 207 పోలింగ్ స్టేషన్ల పేరు మార్పు కోసం ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదించామని కలెక్టర్ తెలిపారు. ఓటర్ల జాబితా ఇంటింటా పరిశీలన దాదాపు పూర్తయ్యిందని, డెత్, షిఫ్టెడ్, రిపీటెడ్ ఓట్లను ఒకటికి రెండుసార్లు పరిశీలించామన్నారు. జిల్లాలో ఓటరు జాబితాకు సంబంధించి అందిన క్లెయిమ్స్, అభ్యంతరాలు పక్కాగా పరిశీలిస్తున్నామన్నారు. అలాగే రాజకీయ పార్టీల ప్రతినిధులంతా తప్పులు లేని స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనకు కృషిచేయాలని కోరారు. జిల్లాలో డిలీట్ అయిన ఓట్లను బీఎల్వోలు పోలింగ్ స్టేషన్ వారీగా పరిశీలించారాని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియపై అడిగిన ప్రశ్నలకు కలెక్టర్ సమాధానమిస్తూ, వారి సందేహాలను నివృత్తి చేశారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.సన్యాసిరావు, రాజకీయా పార్టీల ప్రతినిధులు కోమటి రాంబాబు (వైఎస్సార్ సీపీ), కోమటి రవికుమార్ (బీజేపీ), మరపట్ల శ్యాంబాబు (టీడీపీ), జేఎన్వీ గోపాలన్ (సీపీఐ (ఎం), టి వంశీ, శ్రీనివాసరెడ్డి (కాంగ్రెస్) పాల్గొన్నారు.

ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం

ముసునూరు: ఏళ్ల నాటి రేషన్ కార్డుల సమస్యకు జగనన్న చెబుదాం కార్యక్రమంలో పరిష్కారం లభించింది. ఏలూరు జిల్లా ముసునూరుకు చెందిన బత్తిన సత్యనారాయణ కుమారులు సురేష్, రామకృష్ణకు ఏడేళ్ల క్రితం వివాహాలు జరిగాయి. అప్పటినుంచి వీరి కుటుంబాలు రేషన్ కార్డుల కోసం ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. కొత్త కార్డుల కోసం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు అర్జీ అందజేశారు. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు వీరి వివరాలను రాష్ట్రస్థాయి అధికారులకు పంపారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని అక్కడి నుంచి వివరణ అందింది. దీంతో ఈ పత్రాలను కలెక్టర్ లబ్ధిదారులకు అందించారు.

రొమ్ము క్యాన్సర్‌కు ఆధునిక చికిత్స



జాతీయ స్థాయి సెమినార్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

సాక్షి, భీమవరం: పట్టణంలోని బీవీ రాజు డిగ్రీ కళాశాలలో లైఫ్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం బ్రెస్ట్ క్యాన్సర్‌పై జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎం.బ్రహ్మానందం మాట్లాడుతూ ప్రతి 28 మంది మహిళల్లో ఒకరు రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. 60 ఏళ్ల పైబడిన మహిళల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటుందని, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి ఆధునిక చికిత్స ద్వారా నయం చేయవచ్చని అన్నారు. దీనిపై గ్రామీణ ప్రాంత మహిళలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. క్యాన్సర్‌పై అపోహలు వీడాలన్నారు. ఈ కార్యక్రమంలో గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎం.రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తెల్లతాచు హల్‌చల్



తెల్లతాచును చాకచక్యంగా పట్టుకున్న స్నేక్ సేవియర్ సొసైటీ అధ్యక్షుడు చదలవాడ క్రాంతి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలోని గోశాలలో తెల్ల తాచు హల్‌చల్ చేసింది. పట్టణంలోని ఏలూరు రోడ్ జీడిపిక్కల ఫ్యాక్టరీ పక్కన ఉన్న గోసంరక్షణ కేంద్రంలో 7 అడుగుల తెల్లతాచు కనిపించింది. దీంతో నిర్వాహకులు శ్రీకాంత్ గోవులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా, వెంటనే సమాచారాన్ని స్నేక్ సేవియర్ సొసైటీ అధ్యక్షుడు చదలవాడ క్రాంతి తెలిపారు. సమాచారం అందుకున్న క్రాంతి ఘటనా స్థలానికి చేరుకుని చాకచక్యంగా, ఎలాంటి ప్రమాదం లేకుండా తెల్లతాచును పట్టుకున్నారు. ఈ సందర్భంగా క్రాంతి మాట్లాడుతూ పట్టుకున్న తెల్ల తాచు స్థానిక అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలివేయనున్నట్లు చెప్పారు.

ఇద్దరు వ్యక్తుల ఆత్మహత్యాయత్నం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): ఇద్దరు వ్యక్తుల మధ్య మనస్పర్థల కారణంగా ఆత్మహత్యా ప్రయత్నం చేసి ఆస్పత్రి పాలైన సంఘటన జీలుగుమిల్లిలో చోటు చేసుకుంది. గ్రామంలో కోలాటం గురువుగా ఉన్న వ్యక్తి అదే గ్రామంలోని వ్యాపారస్తుడికి మధ్య చిన్న పాటి వివాదం వచ్చింది. వివాదంపై గ్రామస్తులు శుక్రవారం పంచాయతీ ఏర్పాటు చేశారు. తాను నేర్పించే కోలాటానికి వస్తున్న స్త్రీల పట్ల వ్యాపారస్తుడు అసభ్యంగా మాట్లాడాడంటూ కోలాటం మాస్టారు పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేశాడు. వెంటనే గ్రామస్తులు అతనిని జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు. వ్యాపారస్తుడిని పిలిపించి మాట్లాడగా అతను కూడా పురుగుల మందు తాగినట్లు గ్రామస్తులు తెలిపారు. దీనితో అతనిని జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు.

ఖేలో ఇండియా క్రీడాకారుల సత్తా

జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాల పంట

ఏలూరు రూరల్: ఏలూరులో రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా సెంటర్ (ఎస్‌టీసీ)కు పూర్వ వైభవం వచ్చింది. రెండేళ్లుగా ఈ సెంటర్ క్రీడాకారులు పలు పోటీల్లో పతకాల పంట పండిస్తున్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రత్యర్థులను చిత్తు చేసి ఔరా అనిపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సెంటర్ అభివృద్ధికి చర్యలు తీసుకోవడంతో సెంటర్‌లో జాతీయ స్థాయి మౌలిక వసతులు ఏర్పాటయ్యాయి. దీంతో క్రీడాకారుల్లో ఉత్సాహం ఉరకలేస్తోంది. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం కోచ్‌ల పర్యవేక్షణలో అథ్లెటిక్స్, వెయిట్‌లిఫ్టింగ్‌లో రాటుదేలుతున్నారు. సుమారు 25 ఏళ్ల క్రితం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) పేరుతో ఏర్పాటైన ఈ సెంటర్ నేడు ఎస్‌టీసీ పేరుతో నడుస్తోంది. 16 నుంచి 21 ఏళ్ల వయసు కలిగిన బాలబాలికలు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు యువత ఆసక్తి చూపిస్తోంది. ప్రభుత్వం క్రీడాకారులకు ఉచిత విద్య, వైద్యం, వసతి, భోజనంతో పాటు బీమా సైతం అందిస్తోంది.

పతకాలు సాధిస్తున్న బాలికలు

జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సెంటర్ లిఫ్టర్లు ప్రతిభ చాటుతున్నారు. కోచ్ వి.ఉదయ్‌సందీప్ వద్ద శిక్షణ పొందుతున్న యు.లక్ష్మీప్రసన్న 2022లో యూపీలో జరిగిన ఖేలో ఇండియా జూనియర్, సీనియర్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించింది. 2023 జూన్ 6నుంచి 13 వరకూ మధ్యప్రదేశ్‌లో 66వ స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో రేవతి 75 కేజీల విభాగంలో బంగారు పతకం సొంతం చేసుకుంది. అండర్–16 అథ్లెటిక్స్ విభాగంలో వి.భార్గవి జావెలిన్ త్రో, షాట్‌పుట్‌లో రెండు బంగారు పతకాలు సాధించింది. జి.నీలిమ 20 ఏళ్ల విభాగం జావెలిన్ త్రోలో మరో బంగారు పతకం చేజిక్కించుకుంది. ఎం.మానస సైతం రజతం, కాంస్యం సాధించగా, ఇదే క్రీడాంశంలో బి.షాలిని మరో రజతం సొంతం చేసుకుంది.



పతకాలు సాధించిన అథ్లెట్లు

సత్తా చాటిన బాలురు

ఈ ఏడాది ఫిబ్రవరి 20 నుంచి 26 వరకూ పంజాబ్ రాష్ట్రం పాటియాలలో ఆల్ ఇండియా స్టేట్ లెవల్ ఖేలో ఇండియా సెంటర్ అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న ఎస్‌టీసీ అథ్లెట్లు పతకాల పంట పండించారు. ఎస్.లక్ష్మణ్ 400 మీటర్ల హర్డిల్స్‌ను 54.36 సెకన్లతో పూర్తి చేసి బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఇదే పోటీల్లో 200 మీటర్ల పరుగు పందెంలో లతిఫ్, 110 మీటర్ల హర్డిల్స్‌లో శామ్యూల్‌రాజ్, 800 మీటర్ల పరుగులో రాకేష్ మెరిశారు. బాలుర విభాగంలో కె.ధనుష్ ట్రయథ్లాన్, 60 మీటర్ల పరుగు పోటీల్లో రెండు బంగారు పతకాలు గెలిచాడు. మరోపక్క హేమర్‌త్రో అంశంలో పి.వెంకటేష్ హేమర్‌త్రోలో మరో బంగారు పతకం చేజిక్కించుకున్నాడు. వీరితో పాటు సీహెచ్ ఈశ్వర్, డి.కార్తీక్, జి.గణేష్, కె.దినేష్, కార్తీక్ పవన్ సైతం రజత, కాంస్య పతకాలు సాధించారు.



జాతీయ స్థాయి 400 మీటర్ల హర్డిల్స్‌లో పతకం సాధించిన లక్ష్మణ్



వెయిట్‌లిఫ్టింగ్‌లో స్వర్ణం సాధించిన ఎ.రేవతి

జాతీయస్థాయి మౌలిక వసతులు



కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో ఎస్‌టీసీ సెంటర్‌ను మరింత అభివృద్ధి చేశాం. సెంటర్ లోపల ప్రత్యేక జిమ్ ఏర్పాటు చేశాం. మొత్తంగా 43 మంది క్రీడాకారులకు జాతీయస్థాయి మౌలిక వసతులు కల్పించడంతో పాటు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నాం. ప్రతిరోజూ శిక్షణ అందిస్తున్నాం. అథ్లెట్లు, లిఫ్టర్లు జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి పతకాలు సాధిస్తున్నారు.

– టీఎస్‌వి వినాయక ప్రసాద్, సెంటర్ ఇన్‌చార్జ్

హత్య కేసులో ఆరుగురి అరెస్టు



భీమవరం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనాథ్

సాక్షి, భీమవరం: భీమవరం టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఈ నెల 17న జరిగిన హత్యకేసులో ఆరుగురిని అరెస్టు చేసినట్లు భీమవరం డీఎస్పీ బండారు శ్రీనాథ్ చెప్పారు. శుక్రవారం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రౌడీషీటర్ విజయ్‌బాబును కనకదుర్గమ్మ ఆలయ ప్రాంతంలో పాతకక్షల నేపథ్యంలో ప్రత్యర్థులు కారుతో ఢీకొట్టి కత్తులతో హత్య చేశారన్నారు. ఎస్పీ ఆదేశాలమేరకు కేసు నమోదుచేసి టూటౌన్ సీఐ జి.శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. 2022లో రౌడీ షీటర్ రౌతుల యేసు హత్యకు ప్రతీకారంగా ఆ కేసులో ముద్దాయిలైన వడ్డీ వెంకటదుర్గారావు, విజయ్‌బాబు, గోవిందరావులను హత్యచేయడానికి రౌతుల రఘు పథకం ప్రకారం ఈ పని చేయించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. హత్యకేసులో నిందితులైన భీమవరం కళాభవన్ వీధికి చెందిన పెంట శ్యామ్‌కుమార్, రాయలం తోటకు చెందిన మురపాక సాయిదుర్గారావు, ఏఎస్ఆర్‌నగర్‌కు చెందిన పెంట గణేష్, పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన గంగలకుర్తి రామసూర్య సత్య సుబ్రహ్మణ్యం, వీరవాసరం మండలం నేలపోగులకు చెందిన మానుకొండ కిరణ్, చినఅమిరానికి చెందిన కొడాలి సతీష్‌ను రాయలం తోటలో అరెస్టు చేసిన రిమాండ్‌కు పంపించినట్లు శ్రీనాథ్ చెప్పారు. ప్రధాన నిందితుడు రౌతుల రఘుతో సహా మిగిలిన వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు.

పూజా సామగ్రి కోసం వెళ్తూ మృతి

మరో యువకుడికి తీవ్ర గాయాలు

భీమడోలు: వినాయకుడి పూజా సామగ్రి తెచ్చేందుకు వెళ్తున్న ఇద్దరు స్నేహితుల్ని లారీని వెనుక నుంచి ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పూళ్ల, కురెళ్లగూడెం మధ్య జాతీయరహదారిపై గురువారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో పూళ్లకు చెందిన పర్నా ఈశ్వర్ శ్రీ నాగ మణికంఠ(17) అక్కడిక్కడే మృతి చెందగా.. మరో యువకుడు కొత్తపల్లి సాయి మనోజ్(20) తీవ్రంగా గాయపడ్డాడు. పూళ్లలో ఓ వినాయక మండపంలో అవసరమైన పూజా సామగ్రిని తీసుకొచ్చేందుకు భీమడోలు వెళ్తుండగా.. ఆగిఉన్న లారీని వీరు వెళ్తున్న బైక్ ఢీకొంది. లారీ డ్రైవర్ సిగ్నల్ లైట్లు వేయకపోవడంతో చీకట్లో కనిపించక వెనుక నుంచి ఢీకొట్టారు. ప్రమాదం జరిగిన వెంటనే భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని క్షతగ్రాతులిద్దరిని అంబులెన్స్‌లో భీమడోలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. పర్నా ఈశ్వర్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడ్డ మనోజ్‌ను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మణికంఠ మృతితో పూళ్లలో విషాద ఛాయలు అలముకున్నాయి. అతను ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.





ప్రమాద స్థలంలో శ్రీనాగ మణికంఠ, సాయి మనోజ్, మృతుడు శ్రీనాగమణికంఠ

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన బాలబాలికలను అభినందిస్తున్న హెచ్‌ఎం జీకేడీ సునీత, టీచర్లు

భీమడోలు: గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పెదవేగిలో జరిగిన అండర్ 14, అండర్ 17 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీల్లో సత్తా చాటిన 9 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో క్రీడాకారులను అభినందించారు. పాఠశాలకు చెందిన జి.ప్రేమ్‌కుమార్, బి.వీర మణికంఠ, పి.సాయి చైతన్య, టి.మున్నా, సీహెచ్ స్టార్నిగ్రేస్, వి.తేజస్విని, వై.నాగదుర్గా, ఎస్.తనూజగ్రేస్, జే.లక్ష్మీ ప్రసన్నలు తమ సత్తా చాటరని, వారికి చక్కని తర్ఫీదు అందించిన పీడీలు వి.వెంకటేశ్వరరావు, పి.కృష్ణారావులను హెచ్‌ఎం జీకేడీ సునీత, టీచర్లు, గ్రామపెద్దలు అభినందించారు.

ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎస్‌జీఎఫ్ జట్లకు ఎంపికైన బాలికలు

ఏలూరు రూరల్: శుక్రవారం ఉదయం ఏలూరు కస్తూరిబా బాలికల పాఠశాలలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్–14, 17 బాలికల బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక చేపట్టామని పాఠశాల పీడీ కె.మురళీ కృష్ణ తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం అనుమతితో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో ఎంపిక పోటీలు చేపట్టామన్నారు. ప్రతిభ చాటిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశామని తెలిపారు.

అంబులెన్స్ చోరీ

ఏలూరు టౌన్: ఏలూరు జీజీహెచ్ ఆవరణలో పార్కింగ్ చేసిన ఒక అంబులెన్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఏలూరు తంగెళ్ళమూడికి చెందిన షేక్ ముస్తఫాకు యుకో అంబులెన్స్ ఉంది. అంబులెన్స్‌ను హాస్పిటల్ ఆవరణలో పార్కింగ్ చేయగా అపహరణకు గురైంది. ఈ సంఘటనపై బాధితుడు శుక్రవారం ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పుస్తక పఠనంపై అభిరుచి పెంచుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పుస్తక పఠనంపై అభిరుచిని పెంచేలా జిల్లా గ్రంథాలయ సంస్థ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ చీర్ల పద్మశ్రీ తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా గ్రంథాలయ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పని చేయని 33 గ్రామీణ గ్రంథాలయాలు తిరిగి ప్రారంభించేందుకు అనుమతి కావాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. అదే విధంగా జిల్లాలోని గ్రంథాలయాల్లో రూ.500 లోపు ఉన్న పాత ఫర్నీచర్‌ను, వెయ్యి రూపాయలు లోపు ఉన్న పాతపుస్తకాలు రద్దు చేసేందుకు ఇతర అంశాలు చర్చించి ఆమోదించారు. పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థుల పోటీ పరీక్షల అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

జీఓ 38ని అమలుచేయాలి



జిల్లా రజక జన సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య

ఏలూరు (టూటౌన్) : రాష్ట్రంలో రజకులను కించపర్చడాన్ని నిరోధిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.38ని తక్షణం అమలు చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన సంఘం అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య కోరారు. స్థానిక కొత్తబస్టాండ్ సమీపంలోని జిల్లా కార్యాలయంలో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో అమలు చేసే విషయంలో రాష్ట్ర డీజీపీ స్వయంగా కల్పించుకుని అన్ని జిల్లాల ఎస్పీలకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అప్పుడే తమ మానసిక క్షోభకు ముగింపు పడుతుందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రజకుల సమస్యలపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వృత్తి చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని వాటిని సర్వేయర్‌తో పూర్తి స్థాయిలో సర్వే చేయించి రజక వృత్తిదారులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో రజక సంఘం జిల్లా నాయకులు విఠాల శ్రీనివాస్, జి.మురళి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా చిక్కాల గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బిక్కవోలు సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా కోటి చుక్కల మంగారావు, కార్యదర్శిగా గోటేటి పోసిబాబు, జాయింట్ సెక్రటరీగా గోటేటి వీర్రాజు, కోశాధికారిగా కోటి చుక్కల రాంబాబు, సభ్యులుగా అజ్జా శ్రీను, కోలమూరు వెంకట్రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యుదాఘాతంతో లారీ డ్రైవర్ మృతి



సీతానగరం ఆయిల్‌పాం ఫ్యాక్టరీ వద్ద విద్యుత్ షాక్‌తో మృతి చెందిన లారీ డ్రైవర్ పవన్ కుమార్

చింతలపూడి: చింతలపూడి మండలం సీతానగరం ఆయిల్‌పాం ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం ప్రమాదవశాత్తూ లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన పవన్ కుమార్(43) హైదరాబాద్ నుంచి ఆయిల్ ట్యాంకర్ తీసుకుని ఫ్యాక్టరీకి వచ్చాడు. ట్యాంకర్ ఎక్కి శుభ్రం చేస్తుండగా హైటెన్షన్ విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు అంబులెన్స్‌లో చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని ఆధార్ కార్డు ఆధారంగా యూపీలోని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఎస్ఐ కె.ప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు విధులకు ఆటంకం కల్పించిన వ్యక్తికి జైలు

సాక్షి, భీమవరం: విధి నిర్వహణలో ఉన్న హోంగార్డులను చంపుతామని బెదిరించి విధులకు ఆటంకం కల్పించిన నల్లమిల్లి వెంకటేష్ అనే వ్యక్తికి భీమవరం పీజెసీజె కోర్టు జడ్జి ఎ.పవన్‌కుమార్ మూడు నెలల జైలు శిక్ష విధించినట్లు వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను చెప్పారు. పట్టణంలో 2019 జనవరి 22న నైట్‌బీట్ విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు కుంచె వీరవెంకటసత్యనారాయణ, కడలి సతీష్ బాబు ఆర్‌సీఎం చర్చివద్ద ఇద్దరు వ్యక్తులు కొట్టుకుంటుండగా వారిని విచారిస్తున్నారు. హోంగార్డులను వీరవాసరం గ్రామానికి చెందిన నల్లమిల్లి వెంకటేష్ చంపుతామని బెదిరించడమేగాక విధులకు ఆటంకం కల్పించడంతో వీరవెంకటసత్యనారాయణ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై హరికృష్ణ కేసు దర్యాప్తుచేసి చార్జిషీట్ ఫైల్ చేశారు. నేరం రుజువు కావడంతో జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

నరసాపురంలో భారీ వర్షం

నరసాపురం: పట్టణంలో భారీ వర్షం కురిసింది. గత మూడు రోజులుగా వర్షం కురుస్తూనే ఉంది. శుక్రవారం భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముఖ్యంగా మెయిన్ రోడ్డు, స్టీమర్ రోడ్డు, ప్రకాశం రోడ్డు ప్రాంతాలు నీట మునిగాయి. గణేష్ ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో మండపాల వద్ద భారీ వర్షం ఇబ్బందిగా మారింది.

పాలకొల్లులో 106 మిల్లీమీటర్ల వర్షపాతం

సాక్షి, భీమవరం: జిల్లాలోని పాలకొల్లులో శుక్రవారం అత్యధికంగా 106.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నరసాపురంలో 42.6, యలమంచిలిలో 40.2, వీరవాసరంలో 12.4, పెనుమంట్రలో 11.4, పెనుగొండలో 9.4, ఆచంటలో 8, భీమవరంలో 8.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. శుక్రవారం తెల్లవారుజామున కుండపోతగా వర్షం కురయడంతో పల్లపుప్రాంతాలు జలమయమయ్యాయి. బుధ, గురువారాల్లో అత్యధికంగా 36.2మీ.మీ వర్షపాతం నమోదు కాగా గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం కురిసిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షం వ్యవసాయానికి ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు భావిస్తున్నారు.

వర్గీకరణపై ఆలోచిస్తే బుద్ధి చెబుతాం



ఢిల్లీ ధర్నాలో మాట్లాడుతున్న పుష్పరాజ్

పెనుగొండ : వర్గీకరణ చేయాలని ఆలోచన చేసే పార్టీలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించినట్లు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నట్లు వివరించారు. ఎన్నికల సమయంలో బీజేపీ దళితుల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తుందని, గతంలో టీడీపీని మాలలు కాల గర్భంలో కలిపేశారన్నారు. ఏ పార్టీ అయినా వర్గీకరణ ఆలోచన చేస్తే అదే గతి పడుతుందన్నారు. కార్యక్రమంలో తనతో పాటు జిల్లా అధ్యక్షుడు నేతల సువర్ణరాజు, జిల్లా కార్యదర్శి కొల్లాటి ప్రసాదరావు, భీమవరం మండల అధ్యక్షుడు దాసరి చిరంజీవి, భీమవరం పట్టణ ప్రధాన కార్యదర్శి నేతల సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

భీమవరంలో చోరీ



దొంగతనం జరిగిన ఇంట్లో కారం చల్లిన దృశ్యం

సాక్షి, భీమవరం: భీమవరం వన్‌టౌన్ నర్సయ్య అగ్రహారంలోని ఒక ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. యజమాని కంటి శస్త్ర చికిత్స నిమిత్తం వేరొక ప్రాంతానికి వెళ్లడంతో ఇంటి తాళాలు పగల కొట్టి బీరువా తెరిచి వస్తువులు చోరీ చేశారు. స్థానికుల సమాచారంతో డీఎస్పీ బి.శ్రీనాథ్, సీఐ అడబాల శ్రీను సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దొంగతనం సమయంలో పక్కింటి వారి తలుపులకు గడియపెట్టినట్లు తెలిపారు. ఆచూకీ లభించకుండా గదిలో కారం చల్లినట్లు గుర్తించారు. సంబంధిత యజమాని వచ్చిన తర్వాత వివరాలు తెలుస్తాయన్నారు.

గ్రావెల్ తరలిస్తున్న లారీలకు జరిమానా




లారీలను అదుపులోకి తీసుకున్న ఎస్సై చంటిబాబు

నూజివీడు(ఆగిరిపల్లి): అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తోన్న లారీలకు తహసీల్దార్ ఉదయభాస్కర్ ఒక్కొక్క దానికి రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఎస్సై నంబూరు చంటిబాబు తెలిపారు. కృష్ణాజిల్లా గన్నవరం మండలం గొల్లనపల్లి క్వారీ నుంచి ఎలాంటి పత్రాలు లేకుండా గ్రావెల్ లోడుతో వస్తున్న రెండు లారీలను శుక్రవారం ఎస్ఐ ఆపి అనుమతి పత్రాలు చూపించమని డ్రైవర్లను అడగగా, ఎలాంటి పత్రాలు లేవని తెలిపారు. దీంతో రెండు లారీలను అదుపులోకి తీసుకుని తహసీల్దార్‌కు రిపోర్ట్ చేయగా ఒక్కొక్క దానికి రూ.10 వేలు జరిమానా విధించారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

పోడూరు: పోడూరు గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు నీలాపు చిన్నారావు(28) పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్ఐ కె.నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం చిన్నారావు కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం మద్యం సేవించి ఇంటికి వచ్చిన చిన్నారావును అతని భార్య మందలించింది. దీంతో చిన్నారావు మనస్తాపంతో ఇంటి నుంచి బయటకు వెళ్లి కొంతసేపటికి తిరిగి వచ్చి పురుగులమందు తాగినట్లు భార్యకు చెప్పాడు. భార్య, కుటుంబ సభ్యులు వెంటనే పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

వివాహిత ఆత్మహత్య



బయ్యనగూడెంలో ఆత్మహత్య చేసుకున్న మనెల్లి మౌనిక మృతదేహం

కొయ్యలగూడెం: బయ్యనగూడెంకు చెందిన వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై జీజే విష్ణు వర్ధన్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మనెల్లి మౌనిక(24) ఈనెల 21 రాత్రి బయ్యనగూడెంలోని తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. మౌనిక భర్త విజయ్, అతని తల్లి సుబ్బమ్మ తమ కుమార్తె మౌనికను చిత్రహింసలకు గురి చేసేవారని తండ్రి వెంకటేశు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఆర్డీవోకు అభినందనలు



ఆర్డీవోను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విజిలెన్స్ కమిటి సభ్యుడు జగజ్జీవన్

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన చెన్నయ్యను శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యుడు తెన్నేటి జగజ్జీవన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పలు విషయాలపై ఆర్డీవోతో జగజ్జీవన్ మాట్లాడారు.

బలుసులమ్మకు కేజీ వెండి అందజేత



బలుసులమ్మ ఆలయ కమిటీకి కేజీ వెండిని అందజేస్తున్న భక్తులు కె.సత్యనారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ వారికి వెండి వాకిలి నిమిత్తం తాడేపల్లిగూడెం మార్కెట్ యార్డ్ డైరక్టర్, భక్తులు కురెళ్ల సత్యనారాయణ (సత్యం) కేజీ వెండిని అమ్మవారికి బహుకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొట్టు అంజిబాబు, పెద్దప్రోలు భాస్కర్, రామస్వామి, వీరా కుమార్, రమేష్ కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. తొలుత ఆలయంలో పూజలు జరిగాయి. శుక్రవారం కావడంతో భారీ అన్నసమారాధన జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు అభినందనలు



జగన్నాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తాడేపల్లిగూడెం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలబాలికల అండర్–17 కోకో, కబడ్డీ, అండర్–14 కోకో, కబడ్డీలో ప్రతిభకనబర్చినట్లు స్కూల్ ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా పీడీ కట్టా వెంకటేశ్వరరావును హెచ్ఎం శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ జి.శ్రీను, కమిటి సభ్యులు, అభినందించారు.

మౌలిక వసతులపై శ్రద్ధ వహించాలి

భీమవరం అర్బన్: విద్యతోపాటు పాఠశాలల పౌలిక వసతులు, మధ్యాహ్నం భోజన పథకం పట్ల ప్రధానోపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని ఎండీఎం, సర్వశిక్షాభియాన్ ప్రాగ్రాం కో ఆర్డినేటర్ కృష్ణారావు అన్నారు. భీమవరం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అర్బన్, రూరల్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనాన్ని విద్యార్థులందరూ భుజించే విధంగా చూడాలన్నారు. రాగిజావ, చిక్కీలు, గుడ్లు నూరు శాతం విద్యార్థులు తీసుకునేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. రోజు వారీ మెనూ ప్రకారం ఆహార పదార్థాలు తయారు చేసేలా ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో జి.చిన్నయ్య, మండల విద్యాశాఖాధికారులు శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

కాపులకు అండగా వైఎస్సార్ కాపు నేస్తం

- బ్యాంకు ఖాతాల్లోకి రూ. 15వేలు చొప్పున లబ్ధి
- నాలుగు విడతల్లో 22,544 లబ్ధిదారులకు రూ. 33.81 కోట్లు చెల్లింపులు
- హర్షం వ్యక్తం చేస్తున్న కాపు మహిళలు



తణుకులో కాపు నేస్తం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న కాపు మహిళలు

తణుకు అర్బన్: వైఎస్సార్ కాపు నేస్తం ద్వారా కాపు మహిళలకు ఆర్థికంగా అండగా నిలబడుతుంది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం. 45 నుంచి 60 సంవత్సరాల్లోపు అర్హులైన కాపు మహిళలకు వైఎస్సార్ కాపు నేస్తం పథకం ద్వారా ఏడాదికి రూ. 15వేలు అందచేస్తున్నారు. దీంతో లబ్ధిదారులంతా జగనన్న ప్రభుత్వానికి రుణపడి ఉంటామని ముక్త కంఠంతో చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కాపులకు ఎటువంటి లబ్ధి చేకూరలేదని ప్రస్తుత ప్రభుత్వం రాగానే ప్రజా సంకల్పయాత్రలో జగనన్న ఇచ్చిన హామీ ప్రకారం నవరత్నాల్లో భాగంగా కాపు నేస్తం పథకాన్ని కూడా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని కాపు మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో 4 విడతల్లో రూ. 33.81 కోట్లు చెల్లింపులు..

తణుకు నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి నాలుగు విడతల్లో 22,544 మంది లబ్ధిదారులకుగాను రూ. 33.81 కోట్లు నిధులు ప్రభుత్వం చెల్లింపులు చేసింది. తాజాగా ఈ ఏడాది 6,547 మంది లబ్ధిదారులకుగాను రూ. 9.82 కోట్లు ఇప్పటికే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి. వైఎస్సార్ కాపు నేస్తం ప్రారంభించిన మొదటి ఏడాదిలో 5,620 మంది లబ్ధిదారులు ఉండగా తాజాగా నాలుగో ఏడాది వచ్చేసరికి లబ్ధిదారుల సంఖ్య 6,547కు గణనీయంగా పెరిగింది.

నేడు తణుకులో కాపు నేస్తం సభ...

తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు వైఎస్సార్ కాపు నేస్తం పథకాన్ని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు లాంఛనంగా ప్రారంభిస్తారు. తణుకు నియోజకవర్గం పరిధిలోని మున్సిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు చెందిన కాపు నేస్తం లబ్ధిదారులు పాల్గొననున్నారు.

జగనన్నకు కాపులు రుణపడి ఉంటారు



వైఎస్సార్ కాపు నేస్తం పథకం ద్వారా కాపు మహిళలకు జగనన్న ప్రభుత్వం అండగా నిలబడింది. తణుకు మున్సిపాలిటీ, తణుకు మండలానికి సంబంధించి కాపు మహిళలకు నాలుగు విడతల్లో రూ. 15.08 కోట్లు లబ్ధి చేకూరింది. గతంలో ఏ ప్రభుత్వం కూడా కాపులను చేరదీసిన చరిత్ర రాష్ట్రంలో లేదు. జగనన్నకు కాపులు రుణపడి ఉంటారు.

– నూకల కనకదుర్గ, వైఎస్సార్‌సీపీ తణుకు పట్టణ మహిళాధ్యక్షురాలు

వైఎస్సార్ కాపు నేస్తం పథకం చరిత్రాత్మకం



వైఎస్సార్ కాపు నేస్తం పథకం చరిత్రాత్మకం. రాష్ట్రంలో గణాంకాలపరంగా అధిక సంఖ్యలో ఉన్న కాపులకు గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంతవరకు అండగా నిలబడలేదు. జగనన్న ప్రభుత్వం వచ్చిన అనంతరం కాపు నేస్తం పథకం ద్వారా నాలుగు విడతల్లో అత్తిలి మండలంలోని లబ్ధిదారులకు రూ. 9.76కోట్లు లబ్ధి చేకూరింది.

– కాకర్ల విశాలాక్షి, వైఎస్సార్‌సీపీ అత్తిలి మండల మహిళాధ్యక్షురాలు

అర్హతే ప్రామాణికంగా కాపు మహిళలకు కాపు నేస్తం



కాపులకు ప్రభుత్వం అన్యాయం చేస్తుందని గగ్గోలు పెడుతున్న ప్రతిపక్షాలకు చెంపపెట్టుగా వైఎస్సార్ కాపు నేస్తం ద్వారా ఇరగవరం మండలంలోని కాపు మహిళలకు నాలుగు విడతల్లో మొత్తం రూ. 9.17 కోట్లు లబ్ధి అందింది. గత ప్రభుత్వ హయాంలో కాపు లోన్లు జన్మభూమి కమిటీల పేరుతో కొందరికి మాత్రమే మంజూరు చేసేవారు. కానీ ఇప్పుడు అర్హత ఉన్న కాపు మహిళలందరికీ కాపు నేస్తం లబ్ధి అందుతోంది.

– మెట్ల కిరణ్మయి, వైఎస్సార్‌సీపీ ఇరగవరం మండల మహిళాధ్యక్షురాలు

సీఎం జగన్ మా కుటుంబాన్ని ఆదుకున్నారు



వైఎస్సార్ కాపు నేస్తం ద్వారా ఏడాదికి రూ. 15వేలు చొప్పున ఇప్పటివరకు నాలుగు విడతల్లో రూ. 60వేలు నా బ్యాంకు ఖాతాలో జమఅయ్యాయి. అంతేకాకుండా 3 ఏళ్ల క్రితం నా భర్త చనిపోవడంతో వితంతు పింఛను, బీటెక్ చదువుతున్న నా కుమార్తెకు విద్యాదీవెన, వసతి దీవెనతోపాటు నాకు ఇంటి స్థలం వచ్చింది. నా టైలరింగ్ వృత్తితో ఉపాధి పొందుతూ నా పిల్లలను పోషించుకుంటున్నాను.

– చిట్టీడి వెంకట ఆదిలక్ష్మి, కాపు నేస్తం లబ్ధిదారు, తణుకు

వైఎస్సార్ బీమా అందజేత



నీరుకొండ వెంకటేశ్వరరావు భార్యకు బ్యాంకు ఖాతా పుస్తకాన్ని, అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నీలాద్రిపురం గ్రామానికి చెందిన నీరుకొండ వెంకటేశ్వరరావు గత నెల ఆగస్టులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సందర్భంగా ఆయనకు వైఎస్సార్ బీమా వర్తించడంతో రూ.5లక్షలు ఖాతాకు జమయ్యాయి. దీంతో శుక్రవారం గ్రామ ఉప సర్పంచ్ మేణ్ణి రామారావు, ఎమ్పీటీసీ సభ్యుడు మట్టా సత్యనారాయణ అకౌంట్ పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతుల కుటుంబాలను ఆదుకోవడానికి వైఎస్సార్ బీమా ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ బీమా చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కే.శ్రీనివాస్, విద్యా సంక్షేమ సహాయకులు బి.అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చింతపల్లి, రావిపాడు గ్రామాల్లో గడపగడపకు కార్యక్రమం

పెంటపాడు: మండలంలో ఈ నెల 23న సాయంత్రం చింతపల్లి, రావిపాడు గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొనే ఈ సమావేశానికి అధికారులు, ప్రజాపతినిధులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

చిరుధాన్యాల్లో మెండుగా పోషకాలు

తాడేపల్లిగూడెం రూరల్: చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, మినుములు, కందులు వంటి వాటిల్లో మెండుగా పోషకాలు లభిస్తాయని, గర్భిణులు తమ ఆహారంలో వీటిని తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని మాధవరం సెక్టార్ పరిధి నందమూరు, మారంపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ గర్భవతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆకు కూరలను తీసుకోవాలన్నారు. తద్వారా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతంగా జన్మిస్తాడన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు టి.అన్నపూర్ణ, కే.బంగారం, ఆరోగ్య కార్యదర్శి జి.దీవెన, హెల్త్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలి

అత్తిలి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలకు అందజేసే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేత కారుమూరి సునీల్‌కుమార్ అన్నారు. పోషకాహార మాసోత్సవాలలో భాగంగా అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో శుక్రవారం పోషణర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, సర్పంచ్ కసిరెడ్డి బాలాజీ, మాజీ సర్పంచ్ ఆకుల పండుస్వామి, ట్రస్టుబోర్డు చైర్మన్ తోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహార మాసోత్సవాలు కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్ విజయలక్ష్మి, తదితరులు



ర్యాలీని ప్రారంభిస్తున్న కారుమూరి సునీల్‌కుమార్

విప్పర్రులో పోషణ మాసోత్సవాలు

పెంటపాడు: ప్రభుత్వం తల్లీ బిడ్డల ఆరోగ్యం కోసం ప్రవేశపెడుతున్న పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జీజీబీ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని విప్పర్రు గ్రామంలో శుక్రవారం పోషణమహా మాసోత్సవాలు పురస్కరించుకొని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోషణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఐసీడీఎస్ ద్వారా ప్రవేశపెట్టిన పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విప్పర్రు పీహెచ్‌సీ సబ్‌సెంటర్ సిబ్బంది, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు మున్సిపల్ కార్మికుల ధర్నా



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, కార్మికలను ప్రభుత్వం తప్పక ఆదుకోవాలని కోరుతూ రెండో రోజు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఏరియా కమిటీ నాయకులు, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఓసూరి వీర్రాజు, తాడికొండ వాసులు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కార్మికులు నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, వారికి వేతనాలు పెంచాలని, జీపీఎఫ్ ఖాతాలను సరిచేయాలని తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు కె.చంద్రరావు, కె.కాటమరాజు, యు.నాగరాజు, ఎం.రామకృష్ణ, డి.రవి, ఎల్.శ్రీను, కె.శ్రీనివాస్, శివశంకర్, పండు, భీష్మ, శారమ్మ, కనకలక్ష్మి, సావిత్రి, సత్యవతి, కోటమ్మ తదితర కార్మికులు పాల్గొన్నారు.

కడకట్ల విద్యార్థుల ప్రతిభ



జిల్లా క్రీడలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెంటపాడు: విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలని డా.కోడే వెంకట్రావు మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం కె.సబిత తెలిపారు. ఇటీవల నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో కడకట్ల హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపర్చినట్లు తెలిపారు. 100, 200,1600, 3000 వేల మీటర్ల పరుగుపందెంలో వరసగా శీలి సంతోష్, యోగా విభాగంలో జి. శివాని, కె. సుబ్బలక్ష్మి, టి. సత్యవతి తదితరులు ఉత్తమ ప్రతిభ కనపరిచినట్లు తెలిపారు. వీరు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో యోగా టీచర్ జి. రూప, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం అవసరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దోమల నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని మలేరియా సబ్‌యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పట్టణంలో జరుగుతున్న ఫీవర్ సర్వేలు, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలపై అవగాహన, పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణకు హెల్త్ సిబ్బంది, పారిశుద్య సిబ్బంది తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం అవగాహన కల్పించారు. వార్డులలో అవగాహన ర్యాలీలు జరిగాయి. 1, 2, 5, 30 వార్డుల్లో క్షేత్రస్థాయి పరిశీలనలు జరిగాయి. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ లార్వాను కనుగొనుటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వాటిని నిర్మూలించడం తదితర విషయాలపై సిబ్బంది దృష్టి సారించాలన్నారు. అనుమానిత జ్వర లక్షణాలు ఉంటే అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, వైద్య బృందాలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు చంద్ర, సుష్మ, జయ, ఆరోగ్య సహాయకులు కాంతారావు, రామకృష్ణ, సాయి, వాలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో వార్డులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తణుకు అర్బన్: ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తణుకు వెక్టార్ బోర్న్ డీసీజెస్ కంట్రోల్ సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం తణుకు మునిసిపాలిటీ పరిధిలోని ఇంద్రయ్య నగర్, ఎన్జీవోస్ కాలనీలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో డెంగ్యూ వ్యాధికి అడ్డుకట్ట వేయాలంటే వ్యాధికి కారణమైన పగటిపూట కుట్టే టైగర్ దోమకు చెక్ పెట్టాలని కోరారు. అందుకు అనుగుణంగా దోమ పుట్టుకను నివారించే క్రమంలో భాగంగా వారానికోసారి తప్పనిసరిగా పరిసరాలను శుభ్రం చేయాలని చెప్పారు. చేతుల శుభ్రత, కాచి చల్లార్చిన నీరు తాగడం వంటి నియమాలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సెక్రటరీలు మౌనిక, రాజకుమారి ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, సబ్ యూనిట్ హెల్త్ అసిస్టెంట్స్ తాతాజీ, శ్రీనివాస్, వలంటీర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



తణుకులో ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది

24న లూథరన్ చర్చిలో యూత్ సండే

పెంటపాడు: గూడెం టౌన్ ఎ.క్లాస్ ప్యారిష్ లూథరన్ చర్చిలో ఈనెల 24న యూత్ సండే కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంఘ గురుమండల అధ్యక్షుడు డీ.ఎల్. ఫీనెహాస్ ఒక ప్రకటనలో తెలిపారు. దేవుని ఆధ్యాత్మిక మార్గంలో యువత మరింతగా ముందుండాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ఉదయం 9 నుంచి జరుగుతుందన్నారు. చర్చి యువజనసంఘ సభ్యులు యూత్ సంఘ సభ్యులు పూర్తిగా ఆరాధన కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

జెడ్పీ స్కూల్ పరిశీలన

నరసాపురం రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో పల్లపు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. శుక్రవారం వేకువజాము నుంచి మధ్యాహ్నం వరకూ కురిసిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు, గోతుల్లో నీరు నిలిపోయింది. మండలంలోని కాళీపట్నం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీటిని జెడ్పీటీసీ పరిశీలించి నీటిని మళ్లించే ఏర్పాటు చేసి విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టారు. తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న అధిక వర్షం మరింత అధికంగా పడితే సార్వా పంటకు ముప్పు వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు.

విశాఖ నుంచి పరిపాలన ప్రకటించడం పట్ల హర్షం

తణుకు టౌన్: విజయ దశమి నుంచి విశాఖపట్టణం నుంచే పరిపాలనను ప్రారంభించడం జరుగుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం పట్ల మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం తణుకులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో విశాఖ కేంద్రం పరిపాలన చేపట్టాలనే మంచి ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారని, దీనిని వచ్చే విజయ దశమి నుంచి చేపట్టడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్త శుద్ధికి నిదర్శనమన్నారు. చంద్రబాబు నాయుడు అన్ని ఆధారాలతో స్కిల్ స్కామ్‌లో దొరికిపోయారని, అందుకే సిఐడీ అరెస్ట్ చేశారని చెప్పారు. చంద్రబాబు నాయుడు తన 14 ఏళ్ల పాలనలో ప్రజల సొమ్మును సుమారు రూ. 2 లక్షల కోట్లు దోచుకున్నారన్నారు. ఇదే అభిప్రాయంతో ఉన్న రాష్ట్ర ప్రజలు 2024లో మరోసారి చంద్రబాబును ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈకార్యక్రమంలో నాయకులు కె రాజారావు, కె శ్రీను, ఏ చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

నేడు తణుకులో కాపునేస్తం చెక్కుల పంపిణీ

అత్తిలి: నియోజకవర్గస్థాయిలో జగనన్న కాపునేస్తం పథకం నగదు విడుదల కార్యక్రమం శనివారం మధ్యాహ్నం తణుకు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఈకార్యక్రమానికి హాజరు అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రిజర్వేషన్‌తో మహిళలకు సముచిత స్థానం

సాక్షి, భీమవరం: మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం సమాజంలో సముచిత స్థానం కల్పించినట్లేనని పలువురు మహిళలన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం అరసవల్లి ఈశ్వరమ్మ వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్, వివిధ మహిళ సంఘాలు, శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో హర్షం వ్యక్తం చేస్తూ భీమవరం పీఎస్ఎం బాలికోన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇన్నర్ వీల్ క్లబ్, అలయన్స్ క్లబ్ సభ్యురాండ్రు గంధం శ్రీదేవి, ఆరేటి రాణి, కె.పద్మావతి, మహిళ పోలీస్ ఎండీ షేహనాజ్, మహిళ సంఘాల ప్రతినిధులు పవిత్ర, స్వర్ణ, హైస్కూల్ హెచ్ఎం జె.సుధారాణి మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యులు ఒకేమాటతో మహిళల కోసం రిజర్వేషన్స్ కల్పించడం మహిళ లోకానికే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

సాక్షి, భీమవరం: ఎన్ఎస్ఎస్ వారోత్సవాల్లో భాగంగా భీమవరం సీఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, ఏఎస్ఎన్ రాజు బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ సకుమళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రమాదాల్లో గాయపడిన వారిని ఆదుకునేందుకు అందరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. ఏఎస్ఎన్ రాజు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏఎస్ఎన్ రాజు మాట్లాడుతూ రోగుల అవసరం మేరకు రక్తం అందుబాటులో లేనందున మానవతా దృక్పథంతో రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు.

ఐక్యతతోనే గ్రామాభివృద్ధి సాధ్యం

పాలకోడేరు: ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్, ఉండి ఏఎంసీ ఉపాధ్యక్షుడు చేకూరి నరేంద్రరాజు పంచాయతీ వార్డు సభ్యులకు సూచించారు. శుక్రవారం పంచాయతీ వార్డు సభ్యులు ఆయనను కలిసి గ్రామ అభివృద్ధి పై చర్చించారు. పంచాయతీ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి వార్డు సభ్యులు రెండు వర్గాలుగా చీలిపోయారు. దీంతో గ్రామాభివృద్ధికి అనేక ఆటంకాలు ఏర్పడడంతో అభివృద్ధి మందగించింది. ఇటీవల ఒక వార్డుకు ఉప ఎన్నిక జరిగిన నేపథ్యంలో ఒక వర్గం అభ్యర్థి విజయం సాధించడంతో పరిస్థితులు చక్కబడ్డాయి. అలాగే గురువారం నిర్వహించిన పంచాయతీ పాలకవర్గ సమావేశంలో హరిజనవాడలో చెరువు అభివృద్ధి, చింతలపాటి వారి వీధిలో కల్వర్టు నిర్మాణం, పూడిక తీత అభివృద్ధి పనులపై చర్చించి, తీర్మానాలు చేశారు.